ఫ్లై ఓవర్ నాట్ ఓవర్

నత్తకే నడక నేర్పుతున్న అంబర్‌పేట వంతెన పనులు



నత్తనడకన అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సాగడంతో నిత్యం జామ్ అవుతున్న ట్రాఫిక్

దేడ్ కిలోమీటర్ కామ్..

- ఆరేళ్లయినా పూర్తికాని నిర్మాణ పనులు
- స్థానికులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై జనాగ్రహం

అంబర్‌పేట: అంబర్‌పేటలో చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నట్లు ఉంది. ఆరేళ్లయినా నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం నిత్యం వేలాది మంది అవస్థలు పడుతున్నారు. ఇంత జాప్యం జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కిలోమీటర్నర బ్రిడ్జ్ నిర్మాణానికి ఏళ్లకేళ్లు సమయం తీసుకోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. నిర్మాణ ప్రాంతంలో దుమ్ము ధూళితో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్మాణ పురోగతిని విస్మరించారు..



ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆరేళ్లుగా ఫ్లైఓవర్ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. తూతూమంత్రంగా పర్యవేక్షించి చేతులు దులుపుకుంటున్నారు. స్థానికులతో రెండు ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారే తప్ప ఫ్లైఓవర్‌ను పూర్తి చేయాలనే ఆలోచన ఇక్కడి ప్రజాప్రతినిధులుకు లేకపోవడం విచారకరం.

– మహేందర్,సీపీఎం నాయకులు

దేర్ సే పరేషాన్.!

వ్యాపారాలు కుప్పకూలినై..



అంబర్‌పేట ప్రధాన రోడ్డులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌తో వ్యాపారాలు కుప్పకూలాయి. చిరు వ్యాపారం ఇక్కడి నుంచి తరలివెళ్లారు. ప్రధాన వ్యాపారాలు మూతపడ్డాయి. టైమ్‌కి పూర్తవ్వాల్సిన పనులు ఇంత లేట్ ఎందుకు చేస్తున్నారో అర్థమైతలేదు. ఇన్నేళ్లుగా ఫ్లైఓవర్ పనులు చేపట్టడంలో రికార్డు సృష్టించారు. ఇప్పటికైనా పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

– శ్రీరమణ థియేటర్ మేనేజర్ ఎర్రబోలు నర్సింహారెడ్డి

స్థానికుల బాధలు వర్ణనాతీతం



ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయం మార్గాలను చూపించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. చిన్న చిన్న గల్లీల నుంచి వాహనదారులు వెళ్లడంతో బాగ్ అంబర్‌పేటలోని పోచమ్మ బస్తీ, బూరుజు గల్లీ, చాకలి బస్తీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి అరుగుపై కూర్చునే పరిస్థితి కూడా లేదు. ఐదేళ్ల నుంచి వాహనాల ధ్వనులు, పొగతో నరకం చూస్తున్నాం.

– మొర శ్రీరాములు ముదిరాజ్, బాగ్ అంబర్‌పేట

ఏచూరి మరణం దేశానికి తీరని లోటు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏచూరి మరణం దేశానికి తీరని లోటని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ కార్యాలయంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంబాబుయాదవ్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో చరగని ముద్ర వేసి భారత దేశ ప్రముఖ మేధావిగా సీతారాం ఏచూరి గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.నారాయణ, మారయ్య, మారుతీ, రాముడు తదితరులున్నారు.

సుందరయ్య పార్కులో...

వాకర్స్ క్లబ్ ఆఫ్ సెంట్రల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సుందరయ్య పార్కులో సీతారాం ఏచూరి మృతి పట్ల ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆర్.వివేక్, మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, టి.సైకిలాబ్‌బాబు, నిర్మలరాజశేఖర్, శైలజమోహన్, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాంబాబుయాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో...

బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌వీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి మృతి పట్ల ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు దేశ రాజకీయాల్లో ఆయన చరగని ముద్ర వేశారని కమ్యూనిస్టు యోధుడిగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, బుచ్చిరెడ్డి, జి.రాములు, సాంబిరెడ్డి, రఘుపాల్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ ఎస్‌జీఎఫ్ అండర్–19 ఇంటర్ జూనియర్ కాలేజీ జిల్లా స్థాయి బాలుర, బాలికల కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ పోటీల్లో అంబేడ్కర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీలు దోమలగూడలోని గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మహేందర్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 58 కళాశాలలు పాల్గొనగా బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు కబడ్డీలో రెండో స్థానం, ఖో–ఖోలో మూడో స్థానాన్ని పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యంతో పాటు ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన అంబేద్కర్ కళాశాల జట్టు సభ్యులు

ఉత్తమ సమాజ మార్గ నిర్దేశకులు గురువులే..



కట్టెల సుభాష్‌ను సన్మానిస్తున్న నల్లకుంట మాతా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

నల్లకుంట: ఉత్తమ సమాజ మార్గనిర్దేశకులు గురువులేనని వక్తలు పేర్కొన్నారు. సమాజంలో గురువులది ఎప్పటికీ గొప్ప స్థానమేనని చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని నల్లకుంట మాతా వాకర్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంటలోని హోటల్ హాల్‌లో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన క్లబ్ అధ్యక్షుడు వై. మురళీధరుడు ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించి పలువురు ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కట్టెల సుభాష్ పటేల్ తదితరులకు ప్రశంసా పత్రం, పూల మొక్కను అందజేసి శాలువాతో సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, డైరెక్టర్లు శ్రవణ్ బొమ్మిడి, నీల శ్రీధర్, సురేష్ మారం, ఎం. భూపతినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల హౌజ్ అరెస్ట్

అంబర్‌పేట: అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు, కార్పొరేటర్లను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసానికి వెళ్లాలని పార్టీ అధిష్టానం పిలుపునివ్వడంతో బీఆర్‌ఎస్ శ్రేణులను పోలీసలు ఎక్కడిక్కడ కట్టడి చేశారు. నియోజకవర్గంలో కార్పొరేటర్లు పద్మా వెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయకుమార్‌గౌడ్‌ను హౌజ్ అరెస్ట్ చేశారు.

చిక్కడపల్లి: రాజకీయంగా ఎదుర్కోలేకనే కాంగ్రెస్ పార్టీ నేతలు దాడులకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నేత ముఠా జైసింహ మండిపడ్డారు. శుక్రవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించగా గాంధీనగర్‌లోని శ్రీనిధి అపార్ట్‌మెంట్‌లో ఆయన నివాసంలో ముషీరాబాద్ పోలీసులు ఆయనను గృహనిర్బంధం చేశారు.



డీడీకాలనీలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డిని హౌజ్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

శాస్త్రీయ సంగీత శిఖరం ఎంఎస్ సుబ్బలక్ష్మి

చిక్కడపల్లి: శాస్త్రీయ సంగీతంలో ఎంఎస్ సుబ్బలక్ష్మి శిఖర సమానురాలని ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. త్యాగరాయ గానసభలో శుక్రవారం సాయంత్రం భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈల పాట కళాకారుడు కె.శివప్రసాద్ మాట్లాడుతూ... శంకరాచార్య భజగోవిందం శ్లోకాలను గానం చేసి సంగీత ప్రియులకు చేరువయ్యారని అన్నారు. గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో గాయకుడు కల్యాణ్, సంగీత గురువు మంజుల పాల్గొన్నారు.



ఎంఎస్ సుబ్బలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి, కళా జనార్దనామూర్తి

నేడు, రేపు కంటి ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: డాక్టర్ ఎ.రామచంద్రన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బర్కత్‌పురలోని హైదరాబాద్ కంటి ఆస్పత్రిలో ఈనెల 14, 15న కంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డా. వెంకటాచలం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉచితంగా కంటి శుక్లం పరీక్షలు, చికిత్స, డయాబెటీస్ రెటినోపతి పరీక్షలు, గ్లాకోమ స్క్రీనింగ్ పరీక్షలు, చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 27567500, 27564379.

15న గో భక్తుల ఆత్మీయ సమావేశం

కాచిగూడ: అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన కాచిగూడ వీరన్నగుట్ట (శ్రీశ్యామ్ మందిర్ ప్రాంగణ)లో గో భక్తుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి భువనేశ్వరి పీఠం అధిపతులు కమలానంద భారతీస్వామి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సినీ హీరో తల్వార్ సుమన్, బీజేపీ నేత మురళీధర్‌రావు, తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొంటారన్నారు.

బీసీ జాగృతి సేన అధ్యక్షుడిగా కృష్ణయాదవ్

ముషీరాబాద్: బీసీ జాగృతి సేన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడిగా బురుగుపల్లి కృష్ణాయాదవ్‌ను రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నియమించారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తెలుగు రాష్ట్రాల అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లతో పాటు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగంలో బీసీలకు అవకాశాలు కల్పించాలని ఆర్.కృష్ణయ్యతో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు.

25 నుంచి పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలోని పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం అంబర్‌పేటలో ఆమె పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీల్లో అండర్–14 బాలురు, బాలికలు, అండర్–15 బాలురు, బాలికల విభాగాల్లో ఖో–ఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యాశాఖ హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలో 13 ప్రభుత్వ, 8 ఎయిడెడ్, 90 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని అన్నారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ఎంట్రీలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. 23న డ్రా తీస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యదర్శి వి.లక్ష్మణ్‌నాయక్ ఫోన్ నం. 9440731470లో సంప్రదించాలని కోరారు.

ఆటోలో మరిచిన సూట్‌కేసు అప్పగింత



నల్లకుంట: చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన షేక్ సాదిక్(20) ఓయూ విద్యార్థి. శుక్రవారం ఉదయం హిమాయత్‌నగర్ నుంచి నల్లకుంట వరకు ఓ ఆటోలో ప్రయాణించాడు. ఆటో దిగే సమయంలో రూ.60వేల నగదు, బంగారి ఉంగరం ఉన్న సూట్‌కేస్ మరిచిపోయాడు. బాధితుడి ఫిర్యాదుతో స్పందించిన నల్లకుంట పోలీసులు గంటల వ్యవధిలోనే ఆటో వాలాను గుర్తించి అతని వద్ద సూట్ కేసును స్వాధీనం చేసుకుని శుక్రవారం బాధితుడికి అప్పగించినట్లు ఓయూ ఏసీపీ జగన్, ఎస్‌హెచ్‌వో జగదీశ్వర్‌రావు, అడ్మిన్ ఎస్సై జె.శ్రీనివాసారావు తెలిపారు.

బీజేపీని సంస్థాగతంగా పటిష్టం చేయాలి

తెలంగాణ బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి అభయ్ పాటిల్

కాచిగూడ: బీజేపీని బూత్‌స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పార్టీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సంస్థాగతంగా బీజేపీని బలోపేతం చేసినప్పుడే ఎన్నికలలో సరైన ఫలితాలను పొందుతామని ఆయన స్పష్టం చేశారు. బూత్ స్థాయిలో అత్యధికంగా సభ్యత్వాలను చేయించినప్పుడే పార్టీ బలంగా తయారవుతుందని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరితో పార్టీ సభ్యత్వం చేయించాలని కార్యకర్తలకు సూచించారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి మంచి స్పందన లభిస్తోందని, దానిని పార్టీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణ యాదవ్, కాసం వెంకటేశ్వర్లు, చింతల రామచంద్రారెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, కొంపల్లి మాధవిలత, ఎన్వీ సుభాష్, జయశ్రీ, గోలి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు. చిత్రంలో ఎమ్మెల్యే అభయ్ పాటిల్

ఎస్సీ వర్గీకరణకు వేసిన కమిటీని రద్దు చేయాలి

- బీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్
- 30న చలో హైదరాబాద్ సచివాలయ ముట్టడి

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం రేవంత్ రెడ్డి వేసిన మంత్రివర్గ ఉపసంఘం కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన చలో హైదరాబాద్ సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన పార్టీ (బీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. శుక్రవారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వర్గీకరణకు పూనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని తెలంగాలో బొంద పెడతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ క్రిమిలేయర్‌పైన తీర్పు పైన ఇప్పటికే వంతరివ్యూ పిటిషన్‌లు దాఖలు చేసినవి పెండింగ్‌లో ఉండగా ఇంత తొందరగా కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ కమిటీ వేయడం అత్యంత దారుణమన్నారు.

- ఈ కమిటీని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల చర్యలకు నిరసనంగా మోదీ, రేవంత్ రెడ్డి, వర్గీకరణ మంత్రులు, కమిటీ సభ్యుల దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీఎల్ రాజు, జేఎస్ రావు, గవ్వల శ్రీకాంత్, పబ్బతి శ్రీకృష్ణ, ఎస్.అశోక్, ఎన్.శేఖర్, సిహెచ్ రోజా లీలా, పి. సుచంద్ర, పెండ్యాల సునిల్, చంద్రరావు, కె.వెంకటరావు, భూపల్లి హేమలత, తదితరులు పాల్గొన్నారు.



నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడేది హిందీయే..

అంబేడ్కర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మట్టా శేఖర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాష హిందీయే అని అంబేడ్కర్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ అన్నారు. ప్రపంచంలోకి ఎక్కడికి వెళ్లిన భాష సమస్య లేకుండా జీవించగలిగే భాష ఒక్క హిందీయే అని అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మన జాతీయ భాషగా పేరుగాంచిన హిందీ పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. 1949 సెప్టెంబర్ 14న హిందీ భాషను అధికారికంగా జాతీయ భాషగా ప్రకటించిందన్నారు. దేశంలో ఐక్యతను తీసుకురావడానికి మహాత్మ గాంధీ సైతం హిందీని ఎక్కువ ఉపయోగించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హిందీ విభాగం అధిపతి డా. మాధవి, డా. ముదిగొండ భవానీ, కవిత, డాక్టర్ అశోక్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ కళాశాలలో జరిగిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మట్టా శేఖర్

మూసీ పరివాహక నివాసితులకు అన్యాయం చేయొద్దు

అంబర్‌పేట: మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్నా నివాసితులకు మూసీ అభివృద్ధి పేరిట అన్యాయం చేస్తే సీపీఎం పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతుందని అంబర్‌పేట జోన్ కన్వీనర్ మహేందర్ అన్నారు. మూసీ సుందరీకరణ కోసం పరివాహక ప్రాంతాల్లో నివాసాలకు మార్కింగ్ చేశారని దీంతో ప్రజలు నిత్యం తీవ్ర భయందోళనకు గురువుతున్నారని ఆయన మండిపడ్డారు. నివాసితులతో కలిసి శుక్రవారం అంబర్‌పేట మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎప్పుడు తమ ఇళ్లను కూల్చి వేస్తారోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజలు కష్టపడి జీవిస్తున్నారని వారి ఇళ్లను కూల్చివేస్తారని బిక్కు బిక్కు మంటున్నారని అన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యామ్నయ మార్గాలు అన్వేషించి పేదలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ వీరాబాయికి వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో నాయకుల మహేశ్, జి.రాములు, షాబానా, ఆఖిల్, వరలక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు.



అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మూసీ పరివాహక నివాసితులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు.

- ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని అచ్చుత్‌రెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీస్, రాంనగర్ గుండు, మూన్ కేఫ్ ఫీడర్ పరిధిలో శ్రీరామ్‌నగర్, అచ్చయ్యనగర్, మూన్ కేఫ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11.30గంటల వరకు..
- మదర్ డైరీ ఫీడర్ పరిధిలోని రాంనగర్, మదర్స్ హై స్కూల్, సంజీవయ్యనగర్, తిలక్‌నగర్, శివాలయం, చే నంబర్ క్రాస్ రోడ్స్, అంబర్‌పేట మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి 1.30గంటల వరకు,
- ఆర్‌వోఎం ఫీడర్ పరిధిలోని 10టీవీ, ఎంఆర్‌వో ఆఫీస్, ఆర్‌టీసీ కల్యాణ మండపం, ఉమాగార్డెన్, వెంకటేశ్వర టెంపుల్, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బాలోత్సవం సంస్థ కృషి అభినందనీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల లైబ్రరీకి ఎల్‌ఐసీ సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్లను బహూకరించినట్లు తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ జనరల్ మేనేజర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ.. బాలల్లో సృజనాత్మకతను వెలికితీస్తున్న బాలోత్సవం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య, ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

డాక్టర్ విష్ణున్‌రావు



కాచిగూడ: మారిన జీవన విధానంతో జబ్బుల బారిన పడుతున్నారని, ప్రజలు ఆరోగ్య సంరక్షణకు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అలర్జీ, ఆస్తమా వైద్య నిపుణులు డాక్టర్ వీరపనేని విష్ణున్‌రావు అన్నారు. గురువారం నారాయణగూడలోని శ్వాస హాస్పిటల్‌లో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఓవైపు గాలి కాలుష్యం, మరోవైపు రసాయనాలతో ఉత్పత్తిచేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రోజూ వ్యాయామం చేయాలని, కొవ్వు పదార్థాలు, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలని అన్నారు.

ఘనంగా ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు



ముషీరాబాద్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా పలు బసీ సంఘాలు, ఆయన అభిమానులు, ప్రజా సంఘాల నేతలు ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ చరిత్రలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీసీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నానని అన్నారు.



కవాడిగూడ తాళ్లబస్తీలో..



గోల్నాకలో భక్తులు



బాగ్అంబర్‌పేటలోని తురాబ్‌నగర్‌లోని మండపంలో భక్తులు

అనేకదంతమ్ భక్తానాం.. ఏకదంతమ్ ఉపాస్మహే..

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గణపయ్యా.. దీవించయ్యా అంటూ భక్తులు వినాయకుడికి పూజలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు శుక్రవారం మండపాలను సందర్శించి అక్కడ జరిగే పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కొన్ని మండపాల వద్ద భజన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం







నర్సింహబస్తీలో..



కాచిగూడ వైశ్య హాస్టల్‌లో..



హైకోర్టు జస్టిస్ శ్రావణ్‌కుమార్ దంపతులు



టీఆర్టీలో ఏసీపీ తనిఖీలు